క్లుప్తంగా

ఉచిత హోమియో వైద్య శిబిరానికి స్పందన



రోగులకు హోమియోపతి మందులు అందజేస్తున్న డాక్టర్ సెల్వరాజ్

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పంలో మంగళవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని ఆయుష్ హోమియో వైద్యాధికారి డాక్టర్ సెల్వరాజ్ తెలిపారు. శిబిరంలో 72 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు వీధుల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్చార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని, గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో గోవిందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని వీఎస్.అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 75 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాడిపశువులపై శ్రద్ధ పెట్టాలి



పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆసీఫ్

బంగారుపాళెం: రైతులు పాడిపశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆసీఫ్ అన్నారు. స్థానిక పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం ఇండియన్ హెర్బ్స్, కారస్ లేబొరేటరీ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. చూలు నిలవని 60 పశువులను డాక్టర్ ఆసీఫ్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే పశువుల్లో చూలు నిలవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాస్మిన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ రామ్మోహన్

ఐరాల: గర్భిణుల ఆరోగ్యం పట్ల వైద్యసిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్‌హెచ్‌ఎం టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు డీపీఓ రామ్మోహన్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని మొరంపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న వైద్యపరీక్షలపై ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణుల హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్ష చేసి రికార్డులను పరిశీలించారు. హెచ్ఎంఐఎస్ రికార్డులను ధ్రువీకరణ చేశారు. అనంతరం ఆయన ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సెక్టార్ సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత, పీహెచ్ఎన్ జీవకళ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదలతో సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ కౌన్సిలర్ పార్థసారధి నాయుడు అన్నారు. ఇంటర్మీడియెట్ 2024 పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు చిత్తూరులో మంగళవారం ఆయన నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. చిత్తూరు జిల్లా మొదటి ర్యాంక్ సాధించి విద్యార్థిని కే.మౌనిక, చిత్తూరు టౌన్ మూడవ ర్యాంకు సాధించిన టి.దీపికకు, అలాగే కన్నన్ స్కూల్లో పదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన సంతోషిణికి రూ.5వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేసి ఆయన అభినందించారు.

మెప్పిద్దాం.. బడికి పంపుదాం..!

- చిన్నారుల్లో వెంటాడుతున్న స్కూల్ ఫోబియా
- పసి మనసులను సులభంగా మార్చవచ్చు
- తల్లిదండ్రులూ.. మీరే కీలకం



కాణిపాకం: పిల్లలకు ఐదారు సంవత్సరాల వయసు వచ్చే వరకు గతంలో పాఠశాలకు పంపే వారు కాదు. బాల్యం ఇంట్లో పెద్దల మధ్య హాయిగా గడిచిపోయేది. కాలం మారింది. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి పోయింది. చిన్న చిన్న కుటుంబాలు పెరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను వీలైనంత తక్కువ వయసులో పాఠశాలకు పంపడానికి ఇష్టపడుతున్నారు. ఇంటి దగ్గర ఉంటే అల్లరి చేస్తారని, బడికి పంపితే మంచి అలవాట్లు అలవాడతాయని భావిస్తున్నారు. మూడేళ్లకే బడిలో చేర్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతం మొదలు పట్టణాల వరకు ఇదే పరిస్థితి. మూడు సంవత్సరాలు నిండితే చాలు పిల్లలు స్కూల్లో కనిపిస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ చిన్నారులకు పాఠాలు మొదలవుతున్నాయి. కొందరు పిల్లలు బడికి వెళ్లకుండా మారాం చేస్తున్నారు. దీనివెనక ఉన్న కారణాలను గుర్తించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పూతలపట్టు నియోజకవర్గంలో 297 ప్రాథమిక, 35 ప్రాథమికోన్నత, 42 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 17,975 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు స్కూళ్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో 20 వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

తల్లిదండ్రులే కీలకం...

- చిన్నారుల్లో భయాన్ని పోగొట్టడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. కారణాలు ఏమైనా స్కూలుకు వెళ్లమని పేచీ పెట్టే పిల్లలకు సరైన మార్గంలో నచ్చజెప్పాలి.
- పిల్లలను కొట్టడంతో పాటు తిట్టడం, భయపెట్టడం వంటి పనులు చేయకూడదు. బలవంతంగా పాఠశాలకు పంపరాదు. అలా చేస్తే పాఠశాల అంటే వారిలో వ్యతిరేక భావన ఏర్పడే అవకాశం ఉంటుంది.
- స్కూల్‌లో చేర్పిన కొత్తలో తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు స్కూల్‌లో దింపి, పాఠశాల పూర్తి కాగానే తీసుకురావాలి. తద్వారా వారిలో మనోధైర్యం కలుగుతుంది.

ఉపాధ్యాయుల పాత్ర అవసరమే...

- స్కూలుకు వెళ్లిన పిల్లలపై ఉపాధ్యాయుల వ్యవహార శైలి ఎంతగానో ప్రభావితం చూపుతుంది. ఇది భవిష్యత్తులోనూ ఉంటుంది. అందుకే పిల్లల విషయంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకం.
- పిల్లల్లో స్కూల్ ఫోబియాను పోగొట్టాలంటే ఉపాధ్యాయుల సహాయం ఎంతో అవసరం. పిల్లలు ఉపాధ్యాయులను చూడగానే భయపడాలనే భావనతో ఉండకూడదు. సన్నిహితంగా, స్నేహపూర్వకంగా మెలగాలి. ఒక స్నేహితుడిలా మాట్లాడి వారిని దగ్గరకు తీసుకోవాలి.
- పిల్లల మనసులో ఉపాధ్యాయులు కొడతారనే భావన తొలగించే ప్రయత్నం చేయాలి. మా టీచర్ చక్కటి కథలు చెబుతారు.. ఆటలు ఆడిస్తారు.. మాతోనే ఉంటారు అని పిల్లలు చెప్పాలి. చాలా మంచి వారు అని చెప్పారంటే వారు తప్పకుండా పిల్లల విషయంలో విజయం సాధించినట్లే.
- ఉపాధ్యాయుల ప్రవర్తన పిల్లలకు ఇబ్బంది కలగకుండా ఉండాలి. ముఖ్యంగా వారి వస్త్రధారణ, మాట తీరు, ప్రవర్తన, ఇతరులతో కలివిడిగా ఉండే గుణం. ఇలా అన్ని విషయాలు చిన్నారుల్ని ప్రభావితం చేస్తాయి.
- స్కూలుకు రెగ్యులర్‌గా రావడం వల్ల వచ్చే ప్రయోజనం గురించి ఉపాధ్యాయులు చెప్పాలి. చిన్నప్పుడే గొప్ప వారి జీవిత చరిత్రలను చెబితే వారి జీవితాంతం గుర్తుంటాయి. ఓ మంచి లక్ష్యం ఏర్పడడానికి దోహదం చేస్తాయి.

భయాన్ని పోగొట్టాలి...



అప్పటి వరకు ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారడంతో కొంతమంది చిన్న పిల్లలకు స్కూలు అనగానే భయమేస్తుంది. స్కూల్ ఫోబియాతో పిల్లలకు లేనిపోని వ్యాధి లక్షణాలు వస్తుంటాయి. వాంతులు చేసుకోవడం, కడుపులో నొప్పి అంటూ చెబుతుంటారు. వారిని ఆ ఫోబియా నుంచి బయటకు తీసుకురావాలి. ప్రత్యేక వాతావరణం కల్పిస్తే ఫోబియా నుంచి బయటపడతారు. ఒకసారి ఫోబియా నుంచి పిల్లలు బయటకు వస్తే మరలా ఇలాంటి సమస్య ఉత్పన్నం కాదు.

– మురళీకృష్ణ, చిన్నపిల్లల వైద్యుడు, చిత్తూరు

పాఠశాల ఫోబియాను పోగొట్టాలి..

సాధారణంగా పిల్లలు పాఠశాల అంటే భయపడడాన్ని సైన్స్ పరిభాషలో 'స్కూల్ ఫోబియా' అంటారు. ఈ ఫోబియా ఉన్న వారిలో బడి గేటు దగ్గరకు రాగానే బిగ్గరగా ఏడవడం, వాంతులు చేసుకోవడం, తలనొప్పి, కళ్లు తిరగడం, కడుపునొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కనబడుతుంటాయి. తల్లిదండ్రులు ఏదో నటిస్తున్నాడు అనుకోకుండా వారిని జాగ్రత్తగా చూడాలి. బడి అంటే భయపడే పిల్లలను బలవంతంగా పంపడం సరికాదు. వారి భయాన్ని తొలగించేందుకు ప్రయత్నించాలి. దాదాపు నూటికి 90 శాతం మంది పిల్లలు స్కూలుకు ఎలాంటి పేచీ పెట్టకుండా వెళతారు.

కారణాలు అనేకం...

- పిల్లలను చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా చూసుకోవడం. తల్లిదండ్రులను అంటిపెట్టుకుని ఉండడం. ఏక సంతానం కావడం. ఇంటిని, తల్లిదండ్రులను విడిచి ఉండలేకపోవడం. అలవాటైన గృహ వాతావరణం. పాఠశాల వాతావరణం నచ్చకపోవడం. ఉపాధ్యాయుల ప్రవర్తన సక్రమంగా లేకపోవడం తదితర అనేక కారణాలతో పిల్లలు ఏడుస్తూ బడికి వెళ్లకుండా మారాం చేస్తారు.
- పిల్లలు అల్లరి చేసినా, గొడవ చేసినా స్కూలుకు పంపిస్తాం అంటూ తల్లిదండ్రులు భయ పెట్టడం. ఇతర పిల్లల ప్రవర్తన సరిగా లేకపోవడం.

అతిసారం బారిన పడకుండా అప్రమత్తం



నీటితొట్టెను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పూతలపట్టు: ప్రజలు అతిసారం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి కోరారు. మంగళవారం మండలంలోని వేపనపల్లి, తిమ్మిరెడ్డిపల్లి పంచాయతీలను పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని పాఠశాలలు, పంచాయతీ కొళాయిలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం తినకముందు సబ్బుతో చేతులను శుభ్రంగా శుభ్రపరుచుకోవాలని సూచించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ అందరూ గోరువెచ్చని నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, వైద్యాధికారి ప్రవీణ పాల్గొన్నారు.

ఘనంగా గుండాలమ్మ జాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని టాప్‌లైన్‌లో మంగళవారం గుండాలమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. అనంతరం భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి పోశారు. విశేష పూజలు చేసి దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న పీరూసాహెబ్

బంగారుపాళెం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని మలేరియా సబ్‌యూనిట్ అధికారి పీరూసాహెబ్ అన్నారు. జాతీయ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తగ్గువారిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ నివాస గృహాలు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని సూచించారు. అనంతరం ఎస్టీ గురుకుల పాఠశాల, హాస్టళ్లను సిబ్బందితో కలిసి సందర్శించారు. తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్రాయన్, ఆరోగ్య పర్యవేక్షకులు హరికృష్ణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోలాహలం..గంగమ్మ జాతర

– అమ్మవారికి పూజాసామగ్రి సమర్పించిన జెడ్పీ వైస్ చైర్మన్



పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న జెడ్పీ వైస్ చైర్మన్

యాదమరి (పూతలపట్టు): యాదమరి మండలం మాధవరం హరిజనవాడలో మంగళవారం కోలాహలంగా గంగమ్మ జాతరను నిర్వహించారు. ఎంపీపీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో నడివీధి గంగమ్మకు ఉదయం విశేష పూజలు జరిపించారు. అనంతరం గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి పోసి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ధనంజయరెడ్డి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పూజాసామగ్రిని సమర్పించారు. రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఎదురొడ్డి పోరాడుదాం

- ఎన్నికల్లో గెలుపోటములు సహజం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి



1-25 డివిజన్ నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కష్టకాలంలో ఎదురొడ్డి పోరాడుదాం... ఎప్పుడూ కాలం ఇలాగే ఉండదు.. గతంలో ఎన్నో మంచి పనులు ప్రజలకు చేశామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 1–50 డివిజన్ల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేశారని, అయితే ఓటమికి కుంగిపోతే ముందుకు సాగలేమన్నారు. చిత్తూరులో స్వల్ప ఓట్లతో ఓటమి చెందామన్నారు. అధికార పక్షం పనిగట్టుకుని దాడులు చేయడం సరికాదని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. నాలుగు నెలల్లో జగనన్న బాధితుల ఇంటికి వచ్చి భరోసానిస్తారన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై అపోహలు వద్దని, ఇప్పుడు చట్ట ప్రకారం ఎన్నికలు పెట్టలేరన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను తీర్చకపోతే వారి తరపున ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అందరూ సంఘటితంగా ఉంటూ పార్టీని కాపాడుకుందామని మేయర్ అముద అన్నారు. దాడులకు భయపడవద్దని, తామంతా అండగా ఉంటామని చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి అన్నారు. తన కారును ధ్వంసం చేస్తే కేసు పెట్టినట్లు చెప్పారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, ఇప్పుడు వారిని అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కక్ష సాధింపుతో ఇలా చేస్తున్నారనేది ప్రజలూ గ్రహిస్తున్నారన్నారు. అందరూ సమన్వయంతో పనిచేద్దామని పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, నాయకులు, కార్పొరేటర్లు సూర్యప్రతాప్, రాహుల్‌రెడ్డి, రాంగణేష్, సరళమేరి, భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, మధురెడ్డి, చల్లా ముత్తు, పూమణి, ప్రేమ్, బాలసుబ్రమణ్యంరెడ్డి, శివ, మనోహర్, బాబీ, మనోజ్‌రెడ్డి, అన్బు, ప్రకాష్, రాజేంద్ర, సయ్యద్, చాన్‌బాషా, బాబ్లూ, నారాయణ, శరవణ, గణేష్, అల్తాఫ్, శివారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



26-50 డివిజన్ నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

వైభవంగా మోహినీ ఉత్సవం



టి.పుత్తూరులో నిర్వహిస్తున్న మోహినీ ఉత్సవం

- భక్తిప్రపత్తులతో చక్రస్నానం, వసంతోత్సవం, ఉట్లోత్సవం

తవణంపల్లె: టి.పుత్తూరులోని శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మోహినీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో వేదపండితులు ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం సంతపేటకు చెందిన ఉభయదారులు రఘు కుటుంబసభ్యులు స్వామికి తిరుమంజనం, ఉభయకర్త ఈశ్వరి కుటుంబసభ్యులు పాలాభిషేకం చేయించారు. మధ్యాహ్నం ఉభయదారులు రాజారెడ్డి కుటుంబసభ్యులు మోహినీ ఉత్సవానికి పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. సాయంత్రం ఉభయదారులు రాజేష్‌కుమార్ రెడ్డి కుటుంబసభ్యులు ఉట్లోత్సవాన్ని నిర్వహించారు.

చక్రస్నానం



సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న వేదపండితులు

సాయంత్రం ఉభయదారులు రవిచంద్రారెడ్డి కుటుంబసభ్యులు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో వేదపండితులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు.రాత్రి వైభవంగా ధ్వజావరోహణం చేయించారు. అనంతరం స్వామి ఏకాంత సేవతో సేదదీరారు.

నేడు సూర్యప్రభ వాహనం సేవ

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఉయ్యాలసేవ, రాత్రి సూర్యప్రభ వాహనం సేవ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

చిత్తూరు కార్పొరేషన్‌లో అవినీతిని అరికట్టాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు కమిషనర్ అరుణ కన్నుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపించారు. ఫొటోలు, ప్రచార ఆర్భాటాలకే ఆమె పరిమితమయ్యారన్నారు. నగర పాలక సంస్థపై ఆమెకు కనీస అవగాహన లేదన్నారు. ఈమె మాతృ సంస్థ మునిసిపాలిటీ కానప్పటికీ ఇక్కడే ఎందుకు కొనసాగుతున్నారో ఆశ్చర్యంగా ఉందన్నారు. సంస్థలోని వివిధ శాఖల్లో తనకంటూ ఓ వ్యక్తిని నియమించుకుని వారి ద్వారా ప్రతి పనికీ డబ్బులు తీసుకుంటున్నారని, తన మాట వినని కింది స్థాయి సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే సీనియర్ సిబ్బందికి ఉద్యోగోన్నతి ఇవ్వకపోగా.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికుల పేరిట తప్పుడు బిల్లులు పెట్టించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని చెప్పారు. హెల్త్ సెక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, మెప్మా విభాగంలో గోపి అనే ఇద్దరు అధికారుల అవినీతి పెచ్చుమీరిపోయిందని.. కమిషనర్‌కు వీళ్లిద్దరూ బినామీలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ జరిగిన అవినీతిపై అన్ని సాక్ష్యాధారాలను సేకరించామని, త్వరలోనే వాటిని వెల్లడిస్తామన్నారు. కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలపై కలెక్టర్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు నాగరాజు, ధనంజయరావు, లోకనాథం, రాజకుమార్, దాసరి చంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!

- కనుల పండువగా కోనేటిరాయస్వామి కల్యాణోత్సవం

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. తరువాత శాస్త్రోక్తంగా వేదపండితులు కల్యాణోత్సవం నిర్వహించి, ఉత్సవమూర్తులపై తలంబ్రాలు కురిపించి, మహా మంగళ హారతులు సమర్పించారు. భక్తులు ఇద్దరికి చొప్పు న రూ. 300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. ఆ తర్వాత గ్రామ వీధుల్లో గ్రామోత్స వం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, హర్షదీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో నిర్వహిస్తున్న కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగమ్మా..కరుణించమ్మా!



గోనుమాకులపల్లెలో అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



భారత్ నగర్‌లో పూలగెరిగతో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తుడు

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లె, భారత్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతరను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోనుమాకులపల్లె గ్రామస్తుల ఆహ్వానం మేరకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఇక, సోమవారం రాత్రి నుంచే మహిళలు పొంగళ్లు పెట్టారు. దీపారాధన చేశారు. అలాగే అమ్మవారి శిరస్సును పూలగెరిగ, డప్పులు, బాణసంచా వేడుకలతో కోలాహలంగా ఊరేగించారు. మంగళవారం ఉదయం భారత్‌నగర్‌లో ఓ కళాకారుడు ఎలాంటి ఆధారం లేకుండా తలపై రోకలిని నిలబెట్టి, దానిపై నీళ్ల బిందెను ఉంచి నృత్యం చేశాడు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనానికి వందలాది మంది భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తమ మొక్కులు చెల్లించారు. అన్నదానం చేశారు.